నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసు కోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విస్తారంగా వర్షాలు

బూర్జ మండలం నారాయణపురం వద్ద పరవళ్లు తొక్కుతున్న నాగావళి వరద నీరు

- అత్యధికంగా హరిపురంలో 117.75 మి.మీ వర్షం
- జలమయమైన పల్లపు ప్రాంతాలు
- వంశధారలో పెరిగిన వరదనీరు, ఉధృతంగా నాగావళి
- మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- నేడు పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, లావేరు, సరుబుజ్జిలి, పలాస

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గత 24 గంటల్లో అత్యధికంగా మందస మండలం హరిపురంలో 117.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. వంశధారలో వరదనీటి ప్రవాహం పెరిగింది. నది క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తుండడంతో ప్రవాహ స్థాయి పెరిగింది. గొట్టాబ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 8,577 క్యూసెక్కులు ఉండగా, అంతే మొత్తంలో కిందికి విడిచిపెడుతున్నారు. ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అల్పపీడనం వాయుగుండంగా మారనుండడంతో జిల్లాలో మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారుల అవుట్ స్టేషన్ సెలవులను కలెక్టర్ రద్దు చేశారు. కలెక్టరేట్‌లో 08942 240557 ఫోన్ నంబరుతో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటించారు. జూనియర్ కళాశాలలు యధావిధిగా పనిచేస్తాయి.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షాల్లేక అల్లాడుతున్న రైతాంగానికి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి. లావేరులో భారీ వర్షం కురవడంతో లావేరు, సుభద్రాపురం గ్రామాల్లోని ప్రధాన రహదారిపై నుంచి వరద నీరు రెండు అడుగుల మేర ప్రవహించింది. దుకాణాల్లోకి వరదనీరు చొచ్చుకు పోయింది. దీంతో దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. రణస్థలం, రాజాం రహదారి సీతంవలస గ్రామ సమీపంలో రహదారిపై నుంచి నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు కొంత సమయం నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సుభద్రాపురం, చీపురుపల్లి రహదారి లావేరు దుర్గమ్మ ఆలయం సమీపంలో వరద నీరు పోటెత్తింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.

సరుబుజ్జిలి మండలం మూలసవలాపురానికి చెందిన కామినాయుడు చెరువు గట్టుకు బీటలు వారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గట్టుకు ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడి మట్టి పూర్తిగా కల్వర్టు నీటి ప్రవాహంతో కొట్టుకుపోయింది. మూలసవలాపురం, సింధువాడ, మర్రిపాడు, తురకపేట, ఇసుకలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 200 ఎకరాలకు ఈ చెరువు ద్వారా సాగునీరు అందుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కుడి ప్రధాన కాలు ద్వారా వచ్చే నీటితో చెరువు పూర్తిస్థాయిలో నిండి ఉంది. ఏ క్షణానైనా చెరువుగట్టు గండి పడితే పంట పొలాలన్నీ కామినాయుడు చెరువు నీటితో ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు దిగువ భాగంలో ఉన్న రెల్లి వీధి గృహాలకు నీటి నీటి ప్రవాహంతో ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది.

లావేరు : కేశవరాయపురంలో గాలికి నేలకొరిగిన అరటి చెట్లు

లావేరు కూడలిలో జలమయమైన రహదారి

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి సమాచారం అడిగి తెలుసుకున్నారు. వైద్య, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ ఇతర ముఖ్య శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమున్న చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం పిడుగులు పడే అవకాశం ఉన్నందున అవసరమైతే తప్ప ప్రజలకు బయటకు రాకుండా ఉండాలని కోరారు.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారి ఈనెల 19న దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. అధికారులకు అవుట్‌స్టేషన్ సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. మండల, డివిజనల్ స్థాయి కంట్రోల్‌రూమ్‌లు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి చెరువుల నీటిమట్టాలను పర్యవేక్షించాలన్నారు. నదులు, కాలువల గట్లను బలోపేతం చేయాలని సూచించారు. నిత్యావసర వస్తువులను నిల్వ ఉంచి, పునరావాస కేంద్రాలను శుభ్రపరిచి రెవెన్యూ శాఖకు అప్పగించాలన్నారు. రహదారులపై పడిన చెట్ల తొలగింపునకు ఆర్‌అండ్‌బి శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న రహదారులు, వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించే కాజ్‌వేలు మూసివేయాలని రెవెన్యూ, పోలీసు శాఖలను ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	కురిసిన వర్షం (మి.మీల్లో)
గార	32.2
సరుబుజ్జిలి	29.3
నరసన్నపేట	25.6
పోలాకి	24.4
ఎచ్చెర్ల	24.2
శ్రీకాకుళం	20.8
రణస్థలం	18.4
పలాస	17.2
కంచిలి	12.8
నందిగాం	12.4
మెళియాపుట్టి	12.2
లావేరు	12.0
ఆమదాలవలస	11.2
సంతబొమ్మాళి	11.0
మందస	8.0
ఇచ్ఛాపురం	7.8
కవిటి	7.2
టెక్కలి	6.6
జలుమూరు	6.4
హిరమండలం	6.2
వజ్రపుకొత్తూరు	6.2
ఎల్.ఎన్ పేట	5.8
సారవకోట	4.2
జి.సిగడాం	3.4
పాతపట్నం	3.4
బూర్జ	2.4
పొందూరు	2.4
కొత్తూరు	2.2
సోంపేట	2.0
కోటబొమ్మాళి	1.4

పలాస : రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఉద్యోగ భద్రత కల్పించాలి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- మందస

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులను, మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోంపేటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను రాజకీయం పేరుతో తొలగించడం సరైనది కాదన్నారు. ఏడేళ్లుగా పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అతితక్కువ గౌరవ వేతనమిస్తూ... పని చేయించుకోవడం సరికాదన్నారు. పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలన్నారు. పనికార్మికులకు పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలన్నారు. ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతినెలా 5వ తేదీలోగా వేతనాలు బిల్లులు చెల్లించాలన్నారు. మెనూ ఛార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.30 ఇవ్వాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో కంచిలి మండలం కార్యదర్శి కె.కౌసల్య, ఎస్.శ్యామల, కె.సత్యవతి, బి.మీనా పాల్గొన్నారు. అనంతరం స్వీపర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బి.చంద్రకళ, కార్యదర్శిగా పి.కృష్ణవేణి, కోశాధికారిగా దమయంతి, కమిటీ సభ్యులుగా ఎ.గంగాభవానీ, జి.హేమావతి, టి.నిర్మల, కె.పార్వతి, టి.జానకమ్మ, ఎస్.రాజేశ్వరి, ఎస్.సంధ్య, ఎస్.గౌరి, ఎన్.భవానీ పాల్గొన్నారు.

కెజిబివి ప్రిన్సిపాల్స్ అక్రమ బదిలీలు నిలిపివేయాలి

- సమగ్ర శిక్ష ఎపిసిని తొలగించాలి
- సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కస్తూరిబా గాంధీ విద్యాలయాల ప్రిన్సిపాల్స్ అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, సీనియర్ నాయకులు కె.విజయగౌరి, జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని సమగ్ర శిక్ష ఎపిసిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పొందూరు, కంచిలి, గార కెజిబివి ప్రిన్సిపాల్స్‌ను ఎలాంటి విచారణ చేయకుండా, కేవలం స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధారంగా బదిలీ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులను, మహిళా ప్రిన్సిపాల్స్ గౌరవాన్ని ఈ విధంగా ఉల్లంఘించడం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగించే అంశమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్స్ బదిలీకి రాష్ట్ర కార్యాలయం అనుమతి తప్పనిసరి అనే నిబంధనను ఉల్లంఘించారని, బదిలీకి అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ అని చూపించడం వాస్తవాలను దాచే ప్రయత్నమని తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి చర్యలు కెజిబివి పాఠశాలల వాతావరణాన్ని దెబ్బతీసి, విద్యార్థుల భవిష్యత్‌పై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని తప్పుదారి పట్టిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన ఎపిసిపై చర్యలకు డిమాండ్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎపిసి వైఖరి వల్లే బాధితులకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల వైఖరి వల్ల బాధిత మహిళా ప్రిన్సిపాల్‌కు నష్టం వాటిల్లుతోందని, దీనిపై ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్కూల్ తిరిగి ప్రారంభమైన తర్వాత ఒక్కసారి కూడా పొందూరు కెజిబివి పాఠశాలను సందర్శించకుండా, ఎలాంటి విచారణ చేయకుండా పొందూరు ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసే అధికారం ఎపిసికి ఎక్కడ్నుంచి వచ్చిందని ప్రశ్నించారు. గార మహిళా ప్రిన్సిపాల్ అనేక సమస్యలను ఎపిసికి వినతిపత్రాల రూపంలో తెలియజేసినా, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకపోగా, బదులుగా ఆ ప్రిన్సిపాల్ పైనే చర్యలు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. స్థానిక రాజకీయ నాయకుల వేధింపులపై ఆడియో రికార్డింగ్స్ సమర్పించినా, ఎటువంటి చర్యలు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ఎర్రన్న విద్యాసంకల్పం స్క్రీనింగ్ టెస్ట్‌కి

విశేష స్పందన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యాన ఆర్‌ఆర్‌బి గ్రూప్-డి ఉచిత కోచింగ్ కార్యక్రమం కోసం ఎర్రన్న విద్యాసంకల్పంలో భాగంగా శ్రీకాకుళం, పలాస, టెక్కలి కేంద్రాల్లో స్క్రీనింగ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 500 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. ప్రతిభ కనబరిచిన మొదటి 50 మందిని ఎంపిక చేసి, వారికి ఈనెల 24వ తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత క్రాష్ కోర్స్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ తరగతులు శ్రీకాకుళం పాత ఎంపీ ఆఫీస్‌లో జరుగనున్నాయి. పలాసలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎపి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పరిశీలించారు. మాట్లాడుతూ ఈ పరీక్ష విజయవంతం కావడానికి సహకరించిన శ్రీకాకుళం విద్యాధరి కళాశాల యాజమాన్య ప్రతినిధి విద్యావేత్త జామి భీమశంకరరావు, మదర్ థెరిసా పాఠశాల పలాస, విశ్వజ్యోతి జూనియర్ కాలేజ్ యాజమాన్యం, తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతినిధులకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

అంగన్వాడీలకు వేధింపులు

సమస్యను వివరిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలను ఐసిడిఎస్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. వేళాపాళా లేకుండా ఫోన్లు చేస్తూ... మానసికంగా హింసిస్తున్నారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 200 అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్ యాప్ ద్వారా కేంద్రాలకు వచ్చిన సరుకులను పంపిణీ చేయడం, యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పడంతో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 4న అంగన్వాడీ కార్యకర్తలు వారికి ఇచ్చిన సెల్‌ఫోన్లు తిరిగి కార్యాలయానికి అప్పగించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆఫ్‌లైన్‌లోనే ఉద్యోగ విధులను నిర్వహిస్తామని రాత పూర్వకంగా అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా అంగన్వాడీ కేంద్రాలకు రావాల్సిన పాలు ఐసిడిఎస్ కార్యాలయానికి స్టాక్ వచ్చి చేయడంతో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఉన్నతాధికారి అంగన్వాడీ యూనియన్ నాయకులకు రాత్రి సమయాల్లో ఫోన్ చేసి వచ్చిన పాలు స్టాక్‌ను తక్షణమే విడిపించి పంపిణీ చేయాలని ఆదేశించారు. మీరు ఏమి చేస్తారో తెలియదు, మీ సెల్‌ఫోన్లు తీసుకెళ్లి పాలు స్టాక్ విడిపించాల్సిందే అనడంతో అంగన్వాడీ కార్యకర్తల నుంచి సమస్య ఉత్పన్నమైంది. ఏమి చేయాలో తోచక అంగన్వాడీ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. తాము ఆన్‌లైన్‌లో పనిచేయమని చెబుతున్నా ఒత్తిడి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ఉన్నతాధికారి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టానుసారంగా రాత్రి సమయాల్లో ఫోన్ చేసి అనరాని మాటలు ఆడుతున్నారని వాపోతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి పాలు వారోత్సవాలు, గర్భిణులకు, సీమంతాలు ఇలా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు చెబుతున్నారు. కానీ, వాటికి అయ్యే ఖర్చు ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోవడం లేదు. అయినా కచ్చితంగా కార్యక్రమాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇలా అయితే ఎలా ఉద్యోగం చేయగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కార్యాలయం అభివృద్ధికి డబ్బులు ఇవ్వాలని అడుగుతున్నారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ విధానంతో పనిభారం, చాలీచాలని వేతనం, మరోవైపు టిఎ, డిఎలు చెల్లించడం లేదు. రికార్డులు సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదు. అన్ని రికార్డుల్లో ఎఫ్‌సిఆంసి అతి ముఖ్యమైనది. అదీ అందివ్వలేని స్థితిలో అంగన్వాడీలే కొనుక్కోవాల్సి వస్తోంది. ఈ విషయంపై కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ పార్వతి వివరణ కోరగా, అంగన్వాడీ కేంద్రాల్లో పాలు పంపిణీ చేయాలని, వచ్చిన స్టాక్‌ను విడిపించాలని చెప్పానన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

- జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు ఎనిమిది లక్షలు
- పరిశ్రమలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా
- చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యం
- వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్ల ద్వారా సరఫరా
- ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహాలకు, వ్యాపార సముదాయాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీకాకుళం సర్కిల్ ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విపత్తులు సమయంలో తక్షణం విద్యుత్ పునరుద్ధరణ చేసి సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు అంశాలను వెల్లడించారు.

? మెరుగైన విద్యుత్ సరఫరాకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పరిశ్రమలకు ఎటు వంటి అంతరాయం లేకుండా 24 గంటలూ సరఫరా అందిస్తున్నాం. వ్యవసాయ విద్యుత్ కోసం ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేస్తున్నాం. గృహ అవసరాలకు లోవోల్టేజ్ సమస్య లేకుండా విద్యుత్ అందిస్తున్నాం. సమస్యలపై తక్షణం స్పందిస్తున్నాం. జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు ఎనిమిది లక్షలు వరకు ఉన్నాయి. ఎప్పటికప్పుడు సబ్‌స్టేషన్ల నిర్వహణ, విద్యుత్ లైన్లకు సంబంధించిన జంగిల్ క్లీరెన్స్ వంటి పనులు నిర్వహిస్తున్నాం.

? చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఎలా అమలు అవుతుంది?

నెలకు 300 యూనిట్లు లోపు యూనిట్లు వినియోగించే కార్మికులకు ఈ పథకం వర్తిస్తుంది. పొందూరు, జి.సిగడాం, ఆముదాలవలస, ఎచ్చెర్ల, వంటి ప్రాంతాల్లో 800 మంది వరకు ప్రయోజనం పొందుతున్నారు. అర్హులు గుర్తించి అమలు చేస్తున్నాం. ప్రభుత్వ మార్గదర్శికాలకు లోబడి ఈ ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నాం.

? పిఎం సూర్యఘర్ పథకం అమలు ఎలా ఉంది?

రెండు, మూడు, ఐదు కిలోవాట్ల వినియోగం స్థాయి బట్టి ఈ పథకం కింద రూఫ్ టాప్‌లో అమర్చడం జరుగుతుంది. ప్రభుత్వం రూ.అరవై వేల నుంచి రూ.70 వేల వరకు రాయితీస్తుంది. రూ.2.20 లక్షల వరకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. చాలామంది ఈ పథకం సద్వినియోగం చేసుకుంటున్నారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సౌతం సోలార్ విద్యుత్ ప్రోత్సహిస్తున్నాం. భవిష్యత్‌లో కనీస విద్యుత్ వినియోగంలో సోలార్ విద్యుత్ 30 శాతం లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

? వ్యవసాయ విద్యుత్ అమలు తీరు ఎలా ఉంది?

వ్యవసాయానికి రోజుకు 9 గంటల పాటు మెరుగైన విద్యుత్ అందజేస్తున్నాం. ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేశాం. జిల్లాలో అదనంగా 130 ట్రాన్స్‌ఫార్మర్లు, 220 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాం. ఎటువంటి సమస్య ఉన్నా తక్షణం స్పందించి సమస్య పరిష్కరిస్తున్నాం. నీటి పారుదలలో అంతరాయం లేని విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

? విపత్తులను ఎలా ఎదుర్కొంటున్నారు?

ప్రకృతి విపత్తుల శాఖ హెచ్చరికలు నేపథ్యంలో సిబ్బందిని సిద్ధంగా ఉంచుతున్నాం. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మెటీరియల్, వాహనాలు అందుబాటులో ఉంచుతున్నాం. గంటల వ్యవధిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల నుంచి టోల్ ఫ్రీ నంబరు 1912 ద్వారా ఫిర్యాదులు సేకరిస్తున్నాం. జిల్లాలో తుపాన్లు వంటి వాటికి అవకాశం ఉండటంతో అదేస్థాయిలో విద్యుత్‌శాఖ సన్నద్ధంగా ఉంటుంది.

? సేవలకు సరిపడా సిబ్బంది ఉన్నారా?

సిబ్బంది కొరత ఉంది. ఇది రాష్ట్రస్థాయి సమస్య. ఖాళీల సంఖ్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న సిబ్బందితో పనిచేయడం, అవసరమైనప్పుడు ఇతర మార్గాల్లో సేవలు వాడుకుంటున్నాం. ప్రణాళికాబద్ధంగా నిర్వహణ పనులు ఉంటాయి. అవసరం మేరకు కాంట్రాక్టర్ల ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తున్నాం.

మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

వికలాంగ పింఛన్ల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వం అందిస్తున్న వికలాంగ పింఛన్లు అనర్హులు అంటూ తొలగించడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలన్నారు. మండలంలో 43 పంచాయతీలు, 27 సచివాలయాలు పరిధిలో సుమారు 400 వికలాంగ పింఛన్లు రద్దు చేసినట్లు అధికారులు జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తుందన్నారు. అర్హులైన వికలాంగుల పింఛన్ల రద్దు ఆపాలని, లేకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో బాధిత వికలాంగులు కె.రమేష్, కొండలరావు, డి.గణపతి, శాంత, రమణ పాల్గొన్నారు.

జడ్జిని సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

రోటరీ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు రోటరీ క్లబ్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో సేవలందిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి పరేష్ కుమార్, సిఐ మీసాల చిన్నం నాయుడు, డాక్టర్ మోహన్ రోలోలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. రోటరీ క్లబ్ నూతన సభ్యులు డాక్టర్ శేషు యాదవ్, కాళ్ల జయదేవ్, బోయిన శ్రావణ్‌లకు గవర్నర్ చేతులు మీదుగా నూతన సభ్యత్వం తీసుకున్నారు. రోటరీ యువజన మాసం కార్యక్రమంలో గెలిపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా కోర్టు, రవీంద్రభారతి స్కూల్ ఆవరణల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ మోహన్, వెంకటేష్, కార్యదర్శి కాదా రామకోటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనదారుని వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా

పొందూరు: గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల సంచారంపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లోలుగులో ఆదివారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ద్విచక్ర వాహనాలతో పాటు వివిధ రకాల వాహనాల సమాచారం సేకరించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేని వాహనాల వివరాలను నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఎంపీ కేశినేనిని కలిసిన ఎమ్మెల్యే

పలాస : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్‌టిఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీషను ఎంపీ శాలువాతో సత్కరించి, కొండపల్లి బొమ్మను బహుకరించారు.

మాధవరావును సన్మానిస్తున్న నాయకులు

మాధవరావుకు డికె అవార్డు

మెళియాపుట్టి: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీకాకుళంలో ఆదివారం దుప్పల కృష్ణమూర్తి (డికె) స్మారక అవార్డులను ఎంపిక చేశారు. మెళియాపుట్టి ఆంధ్రజ్యోతి విలేకరి గేదెల మాధవరావు ఎంపికయ్యారు. ఈ మేరకు జర్నలిస్టు యూనియన్ సభ్యులు మాధవరావును సన్మానించారు. గ్రామీణ, గిరిజన ప్రాంత సమస్యలపై కథనాలు రాసిన మాధవరావును జిల్లా ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక చేసి అవార్డును అందించారు. ఈయన ఎంపికపై పలువురు మండల నాయకులు, జర్నలిస్టు యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'తెప్పల'కు పురస్కారం

పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

పలాస : విజయవాడ గవర్నర్ పేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో విశ్వసాహితీ కళావేదిక జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాసకు చెందిన రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి పాల్గొన్నారు. విశ్వాసం అంటూ కవితా గానం చేయడంతో విశ్వసాహితీ కళావేదిక పురస్కారం లభించింది. కృష్ణమూర్తిని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లి రమావతి, డాక్టర్ జి.వి.పూర్ణచంద్, డాక్టర్ గజల్ శ్రీనివాస్ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

అరకొర ఎరువులతో ఇబ్బందులు

రెండో విడత సరఫరా అయోమయం

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువులు లోటు లేకుండా చూడాలని నాయకులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ, పైనుంచి వస్తే కదా సరఫరా చేసేదని, వచ్చినంత మట్టుగ పంపిణీ చేస్తున్నామని అధికారులు చేతులెత్తేస్తున్నారు. రైతులకు అరకొర ఎరువులు దొరకడం, మిగతా ఎరువులకు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునుకు వ్యాపారులు ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట మండలంలో సుమారు 18,438 ఎకరాల భూమి విస్తీర్ణం ఉండగా

ఇందులో సుమారు 17,500 ఎకరాల వరకు వరిసాగు చేశారు. అయితే ఇందులో మండలానికి 24 రైతు సేవా కేంద్రాలకు, సొసైటీకి కలిపి 429 టన్నులు యూరియా, 126 టన్నులు డిఎపి సరఫరా వచ్చినట్లు అదికారులు తెలిపారు. అయితే ఇది వరిసాగు విస్తీర్ణానికి మొదటి విడతకే అరకొరగా వచ్చాయని రైతులు తెలిపారు. అయితే వరి ఎదలు వేసి సుమారు 40 రోజుల కావస్తోంది. రెండవ విడత ఎరువు అవసరమైనా సరఫరా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎరువుల ధరలు విషయంలో కూడా ప్రభుత్వం ద్వారా అయితే యూరియా బస్తా 267కి వస్తుంది. అదే ప్రయివేటు వ్యాపారులు స్టాకు ఉన్నా... కొరత సృష్టించి 320 నుంచి 350 వరకు విక్రయాలు చేపడుతున్నారని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు. ప్రయివేటు వ్యాపారుల నుంచి ధరల నియంత్రణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయం మండల వ్యవసాయ అధికారి సూర్యకుమారి వద్ద వివరణ కోరగా, మొదటి, రెండో విడతల సరఫరా చేసిన ఎరువులు సరిపోతా యని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రయివేటు వ్యాపారుల దుకాణాలు పరిశీలి స్తున్నామని, అధిక ధరల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు కథలు చదివి వినిపించారు. రేవంత్‌కు ప్రథమ బహుమతి, రామారావుకు ద్వితీయ బహుమతి, దేవికి తృతీయ బహుమతులు వచ్చాయి. గ్రంథాలయం తరపున విజేతలకు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

నేడు రైతుల ర్యాలీ

సంతబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో రైతులకు ఎరువులు, సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యాన సోమవారం ర్యాలీ నిర్వహిస్తున్నామని వైసిపి మండల అధ్యక్షులు బి.మోహన్‌రెడ్డి తెలిపారు. టెక్కలి అంబేద్కర్ కూడలి నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తామన్నారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి- బూర్జ

స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌పైన చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు వి.సీతారాం బాబు నాయుడు ఆదివారం అన్నారు. మహిళలపై గౌరవాన్ని పెంచుకుంటూ ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక వైసిపి కార్యకర్తలతో చేయి కలిపి ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్న పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్ మానుకోవాలన్నారు.

గోదాం ఇన్‌ఛార్జిగా నానిబాబు

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండల పౌర సరఫరాల గోదాం ఇన్‌ఛార్జిగా డిటి నానిబాబును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నానిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతవరకు టెక్కలి గోదాం ఇన్‌ఛార్జిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ డిటిగా పనిచేసిన ప్రవీణ్‌ను టెక్కలి మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నానిబాబు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం రేషన్ దుకాణాలకు సరుకులు సకాలంలో లిఫ్టింగ్ చేస్తానని, రేషన్ డీలర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

19, 20న జోనల్ స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి క్రీడా పోటీలు పూర్తయ్యాయని, ఆగష్టు 19, 20న విశాఖపట్నంలో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి ఇప్పటికే సమాచారం అందించామని వారందరూ శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో 19న ఉదయం 5 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో బాలురు, బాలికల జట్లు ఎంపిక చేయ బడ్డాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రతినిధులుగా ఈ జట్లు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు ట్రైనింగ్ ఇన్‌చార్జి టి.ఉపేంద్ర 9885096734 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భీమారావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మరువాడ పంచాయతీ పరిధిలో మాజీ వైస్ ఎంపిపి సూరాడ భీమారావు సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు భీమారావు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, ఎంపిటిసి రాజారావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గంట లోకేష్, మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య, జిల్లా మత్స్యకార నాయకులు సూరాడ దానరాజ్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు సూరాడ రాయుడు, మత్స్యకార యువత నాయకులు సూరాడ కృష్ణ, చొక్కర గణపతిస్వామి, చొక్కర రామరాజు పాల్గొన్నారు.

అనివెట్టి మండపం ప్రారంభం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన రాజగోపురం, రూ.75లక్షలతో నిర్మించిన అనివెట్టి మండపాన్ని వ్యవసాయాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు ఆలయ కార్యనిర్వాహధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, కర్రి అప్పారావు, పూజారి శైలజ, ఎస్.శ్రీనివాస్, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని పూజిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాలుష్య రహితంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలని, మట్టి వినాయక ప్రతిమలు పూజించాలని ఎపి ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో తమ సంస్థ తరుపున ఆదివారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పూజించ వద్దన్నారు. నీటిలో చేపలు, ఇతర జీవరాసులు కాలుష్యం వలన మృతి చెందుతాయని, భవిష్యత్‌లో పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. కాలుష్య నిర్మూలనా భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న గోవిందరావు

జగన్నాథ సాగరానికి వంశధార జలాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస శివారు ప్రాంతమైన జగన్నాథ సాగరానికి రెండు రోజుల్లో వంశధార జలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని వంశధార ప్రాజెక్టు టెక్కలి ఇఇ బి.శేఖరరావు అన్నారు. వంశధార ప్రధాన ఎడమ కాలువ 85.3 కి.మీ హరిదాసుపురం వద్ద పేరుకు పోయిన గుర్రపు డెక్కను తొలగించే పనులను ఆదివారం పరిశీలించారు. కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ ఆదేశాలు మేరకు నందిగాం మండలం గొల్లూరు నుంచి హరిదాసుపురం వరకు ఉన్న నీటి సరఫరాకు ఉన్న అంతరాలను ప్రొక్లెయినర్‌తో తొలగిస్తున్నామని తెలిపారు. ఎడమ కాలువ దిగువ భాగంలో అక్రమంగా ఉండడం, ఎగువ ప్రాంతంలోని చిన్నతామారాపల్లి, మాలపేట, బెజ్జిపల్లి తదితర ప్రాంతాల్లో 62 మోటార్ ఇంజిన్లు ఏర్పాటు చేయడంతో 300 క్యూసెక్కుల సాగునీరు ప్రవాహం కాలువలో తగ్గుతోందన్నారు. దీంతో శివారుకు సాగు నీరు అందడంలో ఇబ్బంది కలిగిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన

కాలువను పరిశీలిస్తున్న వంశధార ఇఇ శేఖరరావు

అవరం లేదని, కాలువలో నీటి ప్రవాహం పెరిగిందని తెలిపారు. మరో రెండు రోజుల్లో పలాసతో పాటు వజ్రపుకొత్తూరు మండలానికి సాగునీరు పుష్కలంగా అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వంశధార ఎఇఇ తమ్మినాన రాజశేఖర్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ జి.నిరంజన్, రైతు సంఘం నాయకులు ఎ.షణ్ముఖరావు, సుధాకర్, కుమారస్వామి, జి.వెంకటరమణ. వి.భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అత్యుత్తమ ప్రమాణాలతో శ్రీధర్ ఆస్పత్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉత్తరాంధ్ర ప్రాంతానికే తలమానికంగా నిలిచేలా అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో డాక్టర్ దానేటి శ్రీధర్ ఆస్పత్రిని ప్రారంభించారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని సింహద్వారం సమీపంలో డాక్టర్ శ్రీధర్ ఆస్పత్రిని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆస్పత్రి జిల్లాకే తలమానికంగా నిలవనుందని ఆకాంక్షించారు. అతి తక్కువ ఫీజులతో ఐవిఎఫ్ వైద్యం ద్వారా ఎంతో మహిళలకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ డాక్టర్ దానేటి శ్రీధర్ అందరూ బాగుండాలి, అందులో నేనుండాలన్న ఆలోచనతో ముందుకు సాగే వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మెడికవర్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో సుందర భవనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అందరి భాగస్వామ్యంతో సుందర భవనం నిర్మాణం చేపడతామని పల్సస్ కంపెనీ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా తూర్పు కాపుల చిరకాల వాంఛ త్వరలో నెరవేరుతుందని, ఈ నెలాఖరు నాటికి స్థలం రిజిస్ట్రేషన్ పూర్తిచేసి సెప్టెంబర్ మొదటి వారంలో భూమిపూజ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణం అందరి భాగస్వామ్యంతో జరగాలని, భవన నిర్మాణం పూర్తి చేయడం ద్వారా జిల్లాలో తూర్పుకాపులకు పూర్వ వైభవం రావాలన్నారు. తూర్పు కాపు అధ్యయన వేదిక అధ్యక్షులు శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం

శ్రీనుబాబును సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ప్రతినిధులు లంక గాంధీ, ఆనెపు రామకృష్ణ నాయుడు, ఇజ్జాడ శ్రీనివాస్, లోలుగు రాజశేఖర్, పిన్నింటి భానోజీ నాయుడు, వాళ్ళ సన్యాసినాయుడు, డోల బాలవంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గేదెల శ్రీనుబాబును సత్కరించారు.

'కర్మయోగి' పాఠాలపై బలవంతం సరికాదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాట్లాడుతున్న హరిప్రసన్న

ఉపాధ్యాయులపై ఐగాట్ కర్మయోగి యాప్ పాఠాలను బలవంతంగా రుద్దడంపై డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న ఖండించారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత మే నెల నుంచి యాప్‌లోని వీడియో పాఠాలు వీక్షించి ఎస్సెస్మెంట్‌లు పూర్తి చేసి సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేయాలని అధికారుల నుంచి ఒత్తిడి వస్తుందన్నారు. మొదట నాలుగు పాఠాలు వినాలని చెప్పి ఇప్పుడు 20 వరకు పెంచారని కలెక్టర్ కార్యాలయాల నుంచి వ్యక్తిగతంగా సందేశాలు పంపి ఆరు పాఠాలకు మించని ఉపాధ్యాయుల పేర్లు వాట్సాప్‌లో షేర్ చేసి భయాందోళనలు కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి, ఎందుకు వినాలి అనే విషయంపై ఎవరూ ఉపాధ్యాయులకు స్పష్టత ఇవ్వడం లేదని, ఇంటర్నెట్ ఖర్చుతో పాటు యాప్‌లోనే రోజంతా గడపాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే సమయం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. స్వచ్ఛందంగా వినడం తప్ప బలవంతపు రీతిలో అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినుకు పడితే కష్టాలే

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చిన్న చినుకులు పడినా ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఆదివారం కురిసిన చిన్నపాటి చిరు జల్లులకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పూండి బస్టాండ్ కూడలిలో నీరు చేరిపోవడంతో వాహనచోదకులు, నడిచివెళ్లె వారు సైతం ఇబ్బంది పడుతున్నారు. దుకాణదారులు రహదారిపైకి వచ్చి వ్యాపారాలు చేయడంతో పాటు డ్రైనేజీలు కూడా ఆక్రమిస్తుందడంతో వర్షపునీరు ఎటు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. దీంతో నీరు కూడలిలో నిలిచిపోతుంది. రహదారి విస్తరణతో పాటు డ్రైనేజీ నిర్వహణ పక్కగా

నిలిచిన వర్షపునీరు

నిర్వహిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు. డ్రైనేజీ ఆక్రమణలు వెంటనే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా పశువుల సంచారం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంచరిస్తున్న పశువులు

టెక్కలి మేజర్ పంచాయతీ పరిదిలోని పలు వీధుల్లోను, రోడ్లపై సంచరిస్తున్న పశువులను నిరోధించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గోశాల నిర్వహణ లేక మంత్రి అదేశాలు బే ఖాతర్ చేశారు. దీంతో అధికారులు పనితీరుపై పలువురు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలోని పలు మార్గాల్లోను, వీధుల్లోను, జాతీయ రహదారిపై, ప్రధాన మార్గాల్లో పశువుల సంచారం అధికంగా ఉండేంది. వీటి సంచారం వల్ల ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు పలు అవస్థలకు గురవుతుండేవారు. యథేచ్ఛగా రోడ్లపై సంచరించే పశువులు ఒక్కోసారి వాహనదారులపైకి దూసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇందుకోసం రూ.5 లక్షలు వెచ్చింది గోశాలలను నిర్మించడం, దానిని మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అయితే గోశాల నిర్వహణ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. రెండు, మూడు రోజుల వరకే దానిని వినియోగించుకున్న పంచాయతీ అధికారులు తర్వాత వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో మరలా యథావిధిగానే పశువుల సంచారం అధికమయ్యాయి. పశువులు సంరక్షణకు ఒక వ్యక్తి నియమించారు. పంచాయతీ నిధులు దర్వినియోగం అవుతున్నాయి తప్ప పశువులు రోడ్డుపై తిరగడం నియంత్రించలేదు. మంత్రి టెక్కలి పర్యటనలో పదేపదే చెబుతున్నా... అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యక్తి బలవన్మరణం

మృతి చెందిన అప్పలనాయుడు

పొందూరు: మండలం లోని కనిమెట్ట పంచాయితీ రాందాసు పురానికి చెందిన పేడాడ అప్పల నాయుడు (60) ఆదివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మృతుడు భార్య అప్పలనరసమ్మతో కలిసి హైదరాబాద్‌లో తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు మద్యానికి బానిసయ్యాడని, సుమారు వారం రోజులు క్రితం గ్రామానికి వచ్చిన ఆయన మద్యం తాగుతూ గ్రామంలోనే ఉండి పోయినట్లు పేర్కొన్నారు. భార్య హైదరాబాద్ వచ్చేయాలని చెప్పినా వినకుండా మద్యం తాగుతూ తిరుగుతున్నట్లు తెలిపారు. ఈ నేపద్యంలో ఉదయం ఇంటి ముందర తాడుతో ఉరేసుకుని మృతి చెందాడని పేర్కొన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమించాడు.. పెళ్లి అనగానే కాదన్నాడు

పోలీసులను ఆశ్రయించిన ప్రేమికురాలు

పలాస: ఆరేళ్ల క్రితం తాను జీడి పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తున్న సమయంలో అదే పరిశ్రమలో గుమస్తాగా పనిచేస్తున్న పలాసకు చెందిన జామి నరేష్ వ్యక్తి ప్రేమించాడని, అనంతరం పెళ్లికూడా చేసుకుంటానని శారీరకంగా కలిశాడని, చివరకు పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి కాదు పొమ్మంటున్నాడని సూదికొండ కాలనీకి చెందిన ప్రేమికురాలు కాశీబుగ్గ పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసింది. 18 ఏళ్ల తెలిసీ తెలియని వయసులో తాను జీడి పరిశ్రమలో పనిచేస్తుండగా అక్కడ గుమస్తాగా పనిచేసిన వ్యక్తి ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడన్నారు. ఈ క్రమంలో విశాఖపట్నం, విజయనగరం, పర్లాఖిమిడి వంటి ప్రాంతాల్లో ఆరేళ్ల పాటు తిప్పారని ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల ఆయన పెళ్లి ఏర్పాట్లు చేసుకుంటున్నాడని తెలుసుకొని ఫోన్ చేశానని అన్నారు. నిన్ను పెళ్లిచేసుకోలేనని, ఆయన తల్లితో కూడా మాట్లాడించి అసభ్యకరమైన పదజాలంతో ధూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరింది.

వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలిలో శ్రీకాకుళం ఉన్నతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న హంగర్ బెహరా

విరివిగా మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి హంగర్ బెహరా అన్నారు. మండలంలోని ఈదుపురం బెహరా వీధిలో మత్స్యకారుల యువకులకు మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ చేరుకోవచ్చని ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిషరీస్ సొసైటీ ప్రెసిడెంట్, రామచంద్ర బెహరా, పాల్, యంగిచ్, కౌగిశ్వర్, బసుదేవ్, రవీంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

'పేట'లో కుక్కల బెడద

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో కుక్కలు, పందుల బెడద ఎక్కువయ్యాయి. రోడ్లపై పాదచారులు, వాహనదారులు వెళ్తే అడ్డుగా వస్తున్నాయి. దీంతో భయాందోళన చెందుతున్నారు. మారుతీ నగర్‌లో సుమారు పది కుక్కలు గుంపులుగా సంచరించడంతో ఒకింత భయాందోళనకు గురయ్యారు. చిన్నారులను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా ఉబాలు

సోంపేట: ఇటీవల మండల వ్యాప్తంగా 37 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. దీంతో శివారు ప్రాంతాలకు చెందిన రైతులు దమ్ము, ఉబాలులో బిజీగా ఉన్నారు. వరి నారుమడులు వేసి 45 రోజులు దాటడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు కురవడంతో రైతులకు ఎంతో మేలు చేకూరుంది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ ఎడిఎ భవానీశంకర్, ఎఒ నరసింహమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలోని సోంపేట మండలంలో సాగునీటి వనరులు తక్కువగా ఉన్నాయన్నారు. రైతులు నాట్లు వేసే పద్ధతిలోనే సాగుకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మండలంలోని తొమ్మిది వేల ఎకరాల సాగు విస్తీర్ణంలో ఇప్పటివరకు 3,194 ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

ఉబాలు వేస్తున్న కూలీలు